
# సన్మానం

కట్టా రాంబాబు



సదాశివంగారి ఆనందం ఇంతా అంతాకాదు. ఆయన ఆనందానికి కారణం ఆయనకు జరుగబోయే సన్మానమే. ఆ సన్మానంకూడా సాదా సీదా సన్మానం కాదు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సన్మానం. గవర్నర్‌గారు ఆయనకి శాలువా కప్పితే ముఖ్యమంత్రిగారు పూలదండ వేస్తారు. అంతటి గొప్ప సన్మానాన్ని పొందబోతున్న ఆయనకు ఆనందం కలగడంలో ఆశ్చర్యం లేదు.

సదాశివంగారికి అంతపెద్ద సన్మానం ప్రభుత్వం చేయడానికి కారణం ఆయన ప్రభుత్వానికి చేసిన మేలే. ప్రస్తుతం ప్రభుత్వం ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యకు ఆయనందించిన సహకారం ఆయనకా అవకాశం కల్పించింది. సదాశివంగారు విద్యుత్ శాఖలో పెద్ద ఇంజనీర్. మన రాష్ట్రంలోని ఓ పెద్ద జిల్లాకు విద్యుత్ శాఖాధికారిగా పని చేస్తున్నారు. ఈ వేసవిలో ఆయన అనుసరించిన విద్యుత్ ఆదా జిల్లాకేకాక రాష్ట్రానికెంతో మేలు చేసిందని ఆ విధంగా ఆదాచేసిన వారిలో ఆయనే ప్రథముడు కావడంతో ప్రభుత్వం ఆయన్ని సన్మానించాలనుకుంది.

కరెంట్ కోతకు ఆయనో వినూత్నమైన పథకాన్ని రూపొందించారు. ఒక ప్రణాళిక తయారు చేశారు. దానివల్ల ఎవరికీ ఇబ్బంది వుండదని ఆయన పేపర్ స్టేట్‌మెంట్ కూడా ఇచ్చారు. తను చేసేది ప్రజా సంక్షేమం కోసమని అందరూ సహకరించాలని చెప్పకున్నారు.

తెల్లవారుజామున అయిదు గంటలకు లేవడం ఆరోగ్య రీత్యా మంచిదని అయిదు గంటల తర్వాత కరెంట్‌వుంటే ఎవరూ మంచాలు దిగరని అందుచేత సరిగ్గా ఆ టైముకి కరెంట్ కట్ చెయ్యమని జిల్లాలోని అన్ని సబ్‌స్టేషన్లకు ఆదేశాలిచ్చారు. ఇళ్లలో మోటార్లుంటే నీళ్లు పట్టుకోవడానికి, ఆడాళ్లు పప్పు పచ్చళ్లు రుబ్బుకోవడానికి, గీజర్లు వేసుకోవడానికి వీలుగా మళ్లీ ఎనిమిది గంటలకిచ్చి సరిగ్గా పది గంటలకల్లా తీసెయ్యమన్నారు. పది గంటలకు మగాళ్లు ఆఫీసులకు, పిల్లలు స్కూళ్లకు పోతారు కాబట్టి ఇంట్లో ఆడాళ్లు పనులు పూర్తి చేసుకుని బయట కూర్చుని పక్కింటాళ్లతో బాతాఖానీ కొడతారు కాబట్టి అప్పుడు కరెంట్ సమందరు అందుకని పన్నెండు గంటల వరకు కట్ విధించమన్నారు. సాయంకాలం ఆరుగంటల నుంచి ఏడింటి వరకు ఒక గంటవుంచి రాత్రి పది గంటలవరకు కట్ చెయ్యమన్నారు. ఇంక తెల్లవార్లు వుంచెయ్యమన్నారు. ఇలా మొత్తం మీద రోజుకు పది పన్నెండు గంటలు కోత విధించారు.

ఆయనతో పనిలేకుండా కోత సమయమే కాకుండా అర్ధరాత్రిళ్లు ఇష్టమొచ్చినట్లు తీసేసి ఆయనకు సహకరించారు ఇతర ఉద్యోగులు. రాష్ట్రంలో ఏ అధికారి చేయని విధంగా ఆయనచేసి ఎంతో కరెంట్ ఆదాచేసి ప్రభుత్వ మన్ననలందుకున్నారు. సన్మాన సభలో గవర్నర్‌గారు ఆయన్ని ఎంతో గానో పొగిడారు. ముఖ్యమంత్రిగారైతే ఆయన్ని ఏకంగా ఆకాశానికెత్తేశారు. ఇలాంటివారే రాష్ట్రానికి కావాలన్నారు. మిగిలిన వారంతా ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని విద్యుత్ సంక్షోభంనుంచి కాపాడవలసిన బాధ్యత ఆయన లాంటి ఉద్యోగులదే అన్నారు. తాము అనుసరిస్తున్న సంక్షేమ పథకాలకు ఇటువంటి వారు తోడుంటే చాలన్నారు. ఆయన చేసిన సేవలకు ప్రతిఫలంగా రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వడమే కాకుండా ఆయన్ని విద్యుత్ శాఖకు సలహాదారుగా తీసుకుంటామన్నారు. సదాశివంగారు ఆ సన్మానానికి మురిసిపోయారు.

ఆయన సన్మానం పేరు చెప్పి ఇంట్లో సుమారు పది రోజులనుంచి లేదు. సన్మానం ముగిసిన వెంటనే ఆయన రాజధాని నుంచి ఇంటికి ఆనందంగా బయలుదేరారు. అసలు సన్మానానికి కుటుంబాన్నంతా తీసుకెళదామనుకున్నారు కాని కూతురికి ఆరోగ్యం బాగాలేని కారణంగా ఒక్కరే వెళ్లారు. సదాశివంగారికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్దాడు డిగ్రీ ఫైనల్ పరీక్షలు వ్రాసాడు. చిన్నాడు టెంత్ పరీక్షలు వ్రాసాడు. అమ్మాయి ఇంటర్ ఫస్టియర్ వ్రాసింది. ముగ్గురు రిజల్ట్స్‌కోసం ఎదురు చూస్తున్నారు. పెద్దాణ్ణి పి.జికి పంపించాలని, కూతుర్ని ఎంసెట్ వ్రాయించి మెడిసిన్ చేయించాలని, చిన్నాణ్ణి తన లాగే ఎలక్ట్రికల్ ఇంజనీర్ని చేయించాలని ఆయన అనుకుంటున్నారు.

రైలు దిగి ఇంటికివస్తూ ఎన్నెన్నో ఊహించుకున్నాడు. భార్య, పిల్లలు తనకు ఆనందంగా స్వాగతం పలుకుతారని, భార్య అయితే ఏకంగా దిష్టి తీస్తుందని, తనకు జరిగిన సన్మానాన్ని పిల్లలకు కళ్లకు కట్టినట్టు చెప్పాలని ఊహించుకుంటూ ఇంటికి చేరుకున్నారు.

కాని తాను ఊహించుకున్న దానికి భిన్నంగా ఇంటి వాతావరణం వుండడంతో ఆయన ఆశ్చర్యపోయారు. ఎప్పుడు క్యాంపునుంచి ఇంటికి వచ్చినా ఎంతో ఆప్యాయంగా ఎదురొచ్చే శ్రీమతి దూరంనుంచి తననుచూసి ముఖం తిప్పకుని వెళ్లిపోయింది. వీధిలో పేపర్ చదువుతున్న కొడుకు ఆయన్ని చూడగానే అక్కడినుంచి లేచి తన గదిలోకి పోయి తలుపేసుకున్నాడు. గుమ్మంలోవున్న కూతురు మంచంమీద ముసుగేసుకుని పడుకుంది. ఆఖరాడు తనవంక నిరసనగా చూసి బయటకెళ్లిపోయాడు. అసలేం జరిగిందో ఆయన కర్థంకాలేదు.


"ఏమిటోయ్ అంతా సీరియస్‌గా వున్నారు" సోఫాలో కూర్చుంటూ అడిగాడు భార్యని.

"మేం ఎలావుంటే మీకేం లెండి. మీరు ఆనందంగా సన్మానాలు చేయించుకున్నారుగా" అంది విసుగ్గా.

"ఏం జరిగిందో చెపితేగా తెలిసేది! పిల్లలంతా ఎందుకలా వున్నారు"

"మీరు చేసిన నిర్వాకానికి అలావుండక మీలా ఆనందంగా వుండమంటారా"

30.8.96




"అది కాదోయ్ నేనేం చేశాను" విషయం అర్థంగాక అడిగాడు

"ఏం చెయ్యలా మీరు దండలు వేయించుకొచ్చారుగా అదే ఇపుడు మనకొంప ముంచింది" అందావిడ కోపంగా

"అదేమిటి అలా అంటావు. నాకు జరిగిన సన్మానం సామాన్యమైంది కాదు. ఏ ఉద్యోగి పొందనిదాన్ని నేను పొందాను. జీతం పెరిగింది. ప్రమోషనిచ్చారు. ఇంతకన్నా మనకి కావలసిందే ముంది చెప్పు"

"మీరు చేసిన ఘనకార్యానికి మీకు ఆనందం కలగొచ్చేమో గాని మన పిల్లలు అన్యాయమైపోయారు. ముగ్గురు పరీక్షలు తప్పి కూర్చున్నారు. పెద్దాడి ఫ్రండెవరో యూనివర్సిటీలో కనుక్కుంటే అన్ని పేపర్లు పోయాయట. చిన్నాడి టెంత్ రిజల్ట్సు ఈ ఉదయమే వచ్చింది. వాడూ ఫెయిలయ్యి కూర్చున్నాడు. అమ్మాయి ఫస్టియర్ ఇంటర్ రిజల్ట్సు నిన్న కాలేజీ కొచ్చాయంట. అది ఇంగ్లీష్ గ్రూపులో రెండు సబ్జెక్టులు పోగొట్టుకుంది. అంతా ఏడుస్తూ కూర్చున్నారు."

"అంతా ఒకేసారి కట్టగట్టుకుని ఫెయిలయ్యారేమిటి సరిగ్గా చదివుండరు" అన్నాడు కోపంగా

దాంతో ఆవిడకు చిర్రెత్తుకొచ్చింది.

"చాల్లెండి వాళ్లు చదవలేదా. అసలు మీరు వాళ్లనెప్పుడు చదవనిచ్చారు. రాత్రయ్యి పుస్తకాలు తీసుకుంటే చాలు కరెంట్ కోత. పది, పదకొండు గంటల వరకు ఇవ్వరాయే. పోనీ తెల్లవారుజామున లేచి చదువుకుందామంటే అప్పుడూ కోతాయే. ఇంకెప్పుడు చదువుతారండి.

ప్రభుత్వం చేత మెప్పులు పొందాలనే చూశారుకాని పిల్లల చదువు లేమవుతాయో ఆలోచించలేదు. ఇంకా మార్చికూడా రాకుండా కోత మొదలుపెట్టారు. అప్పుడేగా పరీక్షలు ప్రారంభమయ్యేది. కనీసం పరీక్షలయ్యేదాకా ఆగాలన్న ఇంగిత జ్ఞానం మీకుగాని, మీ డిపార్ట్‌మెంట్‌కు వుండాలికదా. మన పిల్లలే కాదు ఈఊళ్లో ఎవరూ సరిగ్గా పాస్ కాలేదు. రిజల్ట్ సరిగ్గా వుండడంలేదని అంతా టీచర్స్‌ని అంటారుకాని దానికి కారణం మీ కరెంట్‌వాళ్లే. మీరసలు ఎవరినైనా చదవనిచ్చారా. అసలా ఆలోచనే మీకు లేదాయే!

పోనీ చార్జిలైట్లు పెట్టుకోవాలన్నా వాటికి ఛార్జయ్యే కరెంట్‌కూడా మీరుఇవ్వరు. మీ కోతకు ఒకటైమ్, పాడూ లేదు. అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా తీసెయ్యడమే. ఎవర్నీ సరిగ్గా నిద్రపోనివ్వడం లేదు. మన వీధిలో చూడండి. అందరి ముఖాలు ఎలా పీక్కుపోయి వున్నాయో. అంతా సరిగ్గా నిద్రల్లేక లంఖణాలు చేసిన వాళ్లలా తయారయ్యారు. అందరి ఉసురుకొట్టి మనపిల్లలు అన్యాయమై పోయారు.

మన ఇంటికి రెండిళ్ళవతల వున్నావిడ నిన్నొచ్చి నన్ను నానా మాటలంది. వాళ్లాయనకు మొన్న రాత్రి అపెండిసైటిస్ ఆపరేషన్ చేస్తుంటే సడెన్‌గా కరెంట్ తీసేసారంట. గవర్నమెంట్ ఆసుపత్రి కదా అక్కడ జనరేటర్లుండవు, వున్నా పని చేయవు. అంతపెద్ద ఆసుపత్రివున్న వీధిలో కరెంట్ కోత విధించకూడదన్న సంగతి మీకు తెలియక పోతే ఎలా? కాండిల్స్ పెట్టుకుని ఆపరేషన్ చేశారట. మరా చీకట్లో ఏ పొరపాటు జరిగిందో ఆయన ప్రాణంమీద కొచ్చిందట. ఎలా.ఆయితే చచ్చి బ్రతికాడట. ఆవిడొచ్చి ఒక్కమాటకాదు. దీనికంతా మీరే కారణమట.

అయినా కరెంట్ కోతకు ఒక పద్ధతంటూ వుండాలి కదా. ఇష్టమొచ్చినట్లు తీసేస్తే ఎవరికీ మాత్రం మండదు. ఏదో ప్రభుత్వానికి ప్రజలకు మేలు చేశాననుకుంటున్నారు కాని ఆ ప్రజలెవ్వరూ మిమ్మల్ని మెచ్చుకోవడం లేదు. ఇప్పటికైనా మించి పోయింది లేదు. ఒక పద్ధతి ప్రకారంగా. ఎవరికీ ఇబ్బంది కలుగకుండా కోత విధించండి. కోత విధిస్తున్నాం కదా అని ఊరుకోకుండా విద్యుత్ ఉత్పత్తులను పెంచుకునే ప్రణాళికల్ని తయారుచేసి ప్రభుత్వానికి సిఫారసు చెయ్యండి. భవిష్యత్‌లోనైనా ఈ కోత బాధ లేకుండా చెయ్యండి" అంటూ క్లాస్ తీసుకునే సరికి ఆయన బుర్ర తిరిగి పోయింది.

సదాశివంగారిని భార్య చేసిన సన్మానం ఆలోచనలో పడేసింది.

30.8.96 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక